మెడికల్ కాలేజీ ప్లే గ్రౌండ్ ఆ రోజు నిండుగా విచ్చుకున్న పూతోటలా అందంగా, ఆహ్లాదంగా వుంది. ముద్దులొలికే బాలబాలికల కేరింతలతో, అల్లరితో, ఆట పాటలతో కనువిందుగా వుంది ప్లే గ్రౌండ్.

ఆ రోజు ఆ గ్రౌండులో ఆ వూళ్ళో కల్లా పెద్దదీ, మంచి పేరు వున్నదీ అయిన నవతా ఇంగ్లీషు మీడియం స్కూలు వార్షికోత్సవం జరుగుతోంది.

మధ్యాహ్నం రెండు గంటల నుండే బాల బాలికలకు ఆటల పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు.

ఎవరికి వారే బహుమతులు గెలుచుకోవాలన్న పట్టుదలతో ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు.

మా బాబు కూడా ఆ స్కూల్లో సెకెండ్ స్టాండర్డ్ చదువుతుండటం వల్ల, ఆటల్లో చురుకైనవాడు కావటం వల్ల వాడ్ని తీసుకొని నేనూ, నా శ్రీమతి, రెండు సంవత్సరాల మా పాపతో కాలేజీ గ్రౌండ్స్‌కి వచ్చాము. తల్లితండ్రుల్ని ప్రత్యేకంగా ఆహ్వానించడంతో పిల్లలతో కలిసి పెద్దలంతా వచ్చారు.

పిల్లల ఉత్సాహాన్నీ, ఆనందాన్నీ చూస్తున్న పెద్దల మొహాల్లో చెప్పలేని తృప్తి. నిజంగా ఇటువంటి స్కూల్ వార్షికోత్సవాలు సమర్థంగా, శ్రద్ధగా నిర్వహిస్తే పిల్లలకెంతో మనో వికాసం కలుగుతుంది అనడంలో సందేహం ఎంతమాత్రం లేదు.

ఆ సంతోష సంరంభంలో తనూ పాలుపంచుకుందాం అనుకుందేమో మా రెండు సంవత్సరాల చిన్నారి కూడా...మమ్మల్ని వదిలేసి వాళ్ళతో కలిసిపోయింది.


ఏవో కబుర్లు చెప్పుకుంటూ చూస్తూ కూర్చున్నాము మేమిద్దరం. అక్కడ వున్న చాలా మంది సెవెంత్, ఎయిత్ క్లాసు పిల్లలకి చురుగ్గా వుండీ, ముద్దుగా మాట్లాడే మా పాప ఒక పెద్ద సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయిపోయింది.

వాళ్ళంతా పాపని ఆడిస్తూ, పాపతో ఆడుతూ ఎంతో హుషారుగా వున్నారు. పరుగు పందాలు, లాంగ్ జంప్‌లూ, హై జంప్‌లూ, షాట్‌పుట్‌లూ– ఇలా ఎన్నో పోటీలు జరుగుతున్నాయి.

హుషారుగా పోటీల్లో పాల్గొనే బాలలూ, వాళ్ళని ప్రోత్సహిస్తూ కేరింతలు కొడుతున్న స్నేహితులతో, ఎంతో హడావిడిగా వుంది మెడికల్ కాలేజీ గ్రౌండంతా.

మైక్ ముందు కూర్చుని శంకరరావు తన సహజ ఛలోక్తుల్తో నవ్విస్తూ ఎంతో హుషారు గొలిపే సంగతులు చెబుతూ ఆటల పోటీల్లో పాల్గొనే బాలల్ని ఉత్సాహపరుస్తూ, ప్రోత్సహిస్తూ కామెంటరీ చెబుతున్నాడు.

ఇటువంటి సందర్భాలలో కామెంటరీ చెప్పటంలో ఆయన ఆ వూరికి ఆస్థాన విద్వాంసుడి వంటివాడు. గవర్నమెంటు కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగానూ, ఫిజికల్ డైరెక్టరుగానూ పనిచేస్తున్న ఆయన్ని ఆ వూళ్ళోనూ, చుట్టుపక్కల వూళ్ళల్లోనూ కూడా ఇటువంటి సందర్భాలలో కామెంటరీ చెప్పడానికి తప్పక ఆహ్వానిస్తుంటారు.



— ఉమాధర్

సాయంత్రం అయిదు గంటలు కావస్తుండగా మైకులో పిల్లల ఈవెంట్లన్నీ పూర్తయినట్టూ, ఇక పెద్ద వారి ఈవెంట్లు ప్రారంభం కానున్నాయనీ కామెంటేటర్ ప్రకటించగానే పిల్లల చప్పట్లతో ఆ మైదానం అంతా మారుమోగి పోయింది.

పిల్లలందరూ నిశ్శబ్దంగా వుంటే ముందుగా జరిగే ఈవెంటు చెప్పగలనని కామెంటేటర్ అనడంతో అదే

మిటా అన్న ఉత్సుకత ఆవరించింది పిల్లల్లోనూ పెద్దల్లోనూ. ఇప్పుడు మొదటగా ఉపాధ్యాయుల స్లో సైక్లింగ్ రేస్ అని ప్రకటించగానే మరో మారు చప్పట్లు మిన్ను ముట్టాయి.

ఇక బాల బాలికలంతా వారి వారి ఉపాధ్యాయుల్ని బలవంతం చేసి అందరూ పాల్గొనేలా చేశారు. స్లో సైక్లింగ్ రేసు జరుగుతుండగా ఉపాధ్యాయుల్ని ప్రోత్సహిస్తున్న పిల్లల అరుపుల్తో, చప్పట్లతో ఆ ప్రదేశం నిండిపోయింది.

బాలెన్స్ చాలక క్రిందపడిన ఉపాధ్యాయుల్ని సరదాగా గేలి చేసే పిల్లలూ, ముసి ముసి నవ్వుల్తో వాళ్ళ దరిచేరే ఉపాధ్యాయులు అంతా సంబరం...ఆనందలోకం.

ఉపాధ్యాయులు పాల్గొనే అన్ని ఈవెంట్స్ ముగిశాక మళ్ళీ శంకర్రావు మైకు అందుకున్నాడు.

"ఇంతవరకు మా స్కూల్ బాల బాలికల, ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల పోటీలు పూర్తయినాయి. మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడకు వచ్చి, ఇక్కడి కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంతో పాల్గొని, దీన్నొక మధుర ఘట్టంగా మలిచిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియచేస్తూ... ఒక చిన్న ప్రకటన

ఇప్పుడు మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన పేరెంట్స్‌కు కూడా ఒక స్పోర్ట్స్ ఈవెంటు కల్గించాలని మా కోరిక. దీని వివరాలు నేను ఇప్పుడు మైదానంలోకి వచ్చి చెప్పి రిఫరీగా ఆ క్రీడని నిర్వహిస్తాను. తల్లిదండ్రులు అందరూ ఈ క్రీడలో పాల్గొనవలసిందిగా కోరుతూ వారంతా విక్టరీ స్టాండుకు దగ్గరలో నిలబడాలని కోరుతున్నాను. పేరెంట్సందరికీ 'జంఖానా ఈవెంట్' అని చిన్న క్రీడ నిర్వహించదలుచుకున్నాం-అని ముగించారు.

ఆ జింఖానా ఈవెంటు ఎంత మందికి తెలుసునో, తెలియదో కానీ, మాకు మాత్రం తెలియదు. కొంత మంది జంటలు నవ్వుకుంటూ క్రీడలో పాల్గొనటానికి బయలుదేరారు.

కొంత మంది పిల్లలు వారి తల్లిదండ్రుల్ని పాల్గొనవలసినదిగా ప్రాధేయపడుతున్నారు.

ఇదంతా చూస్తూ నేను, నా శ్రీమతి నవ్వుకుంటూ జరగబోయే ఈవెంట్ ఏమిటా అని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము.

మా బాబు వాడు పాల్గొన్న రన్నింగ్ రేసులోనూ, ఫ్రాగ్ రేసులోనూ, లాంగ్ జంప్‌లోనూ ప్రథమ బహుమతుల్ని గెల్చుకున్న విపరీతమైన హుషారులో వున్నాడు. ఉన్నవాడు వున్నట్లు వూరుకోక నాతో "నాన్నా నీవూ, అమ్మా కూడా పాల్గొనండి. తప్పకుండా ప్రైజ్ వస్తుంది అని మొదలుపెట్టాడు.

'మేము వద్దులే బాబు' అని నచ్చచెప్పినా వాడు ప్రతిమాలటం మానలేదు.

మేం పోటీలోకి వెళ్ళితే మరి వెళ్లని ఎలా బాబు మెచ్చుకోటం, నీ దగ్గర వుండదు కదా అని నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

అయితే మా పాపతో అంత వరకూ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్న కొంతమంది అమ్మాయిలు ఒక్కసారిగా-

"అదేంటంకుల్ మీ పాప ఇందాకట్నుంచీ మా దగ్గరే కదా వుంది. మీ పాపను మేం ఆడిస్తాం కానీ మీరు తప్పక పార్టిసిపేట్ చేయాలి అని మా శ్రీమతి చేయి పట్టుకుని "రండి అంటీ మీరు పార్టిసిపేట్ చేయాల్సిందే" అని బలవంతం చేశారు.

సరిగ్గా అప్పుడే విక్టరీ స్టాండ్ వైపు వెళుతున్న శంకర్రావు మమ్మల్ని చూసి "అదేమిటి సార్! యు సీమ్ టు బి ది యంగెస్ట్ కపుల్ ఆఫ్ ఆల్ ది పేరెంట్స్, అటెండింగ్ హియర్. ప్లీజ్ డు పార్టిసిపేట్" అని నన్ను బలవంతం చేశారు.

ఇక బాగుండదని నేను చేదుమింగిన ముఖంతో లేచి నిలబడి మా శ్రీమతి ముఖంలోకి చూశాను. ఆవిడా కాస్త నెర్వస్‌గానే కనిపించింది. ఆవిడ చెయ్యి పట్టుకొని నడుస్తూనే చిన్న అగ్రిమెంట్ చేస్తేశాను.

"ఇదో చూడవోయ్! మనం పిల్లలందరి సరదా కోసం, ముఖ్యంగా మన బాబు సరదా కోసం పార్టిసిపేట్ చేస్తున్నాం అనుకో. జయాపజయాలు చాలా స్పోర్టివ్‌గా తీసుకోగలిగాలి-ఒకవేళ-మనంగాని గెలవకపోవటం జరిగితే రాత్రికి నీ సత్యాగ్రహ కార్యక్రమం మాత్రం నేను భరించలేను. అందులోను నాకు చాలా ఉత్సాహంగా వుంది ఈ రోజు. కనుక నీ చికాకుతో ఈ రాత్రి పాడుచేస్తే అసలే వూరుకోను సరేనా?..." అన్నాను. మా శ్రీమతి ఓటమిని ఒప్పుకోలేదు మరి.

నీ కలమందో నా శ్రీమతి నా హెచ్చరికను కూడా లైటుగా తీసుకుని నవ్వి వూరుకుంది "హమ్మయ్య!" అనుకున్నాను.

శంకర్రావు 'జింఖానా ఈవెంటు' గురించి పరిచయం చేస్తున్నాడు. ఇందులో పాల్గొనే పేరెంట్స్ మొత్తం ముప్పై మంది, అంటే పదిహేను జంటలన్న మాట.

ఈ జింఖానా ఈవెంట్‌లో మగవాళ్ళంతా ఒక లైన్‌లో నిలబడతారు. వారి కెదురుగా సుమారు యాభై మీటర్ల దూరంలో ఆడవారంతా నిలబడతారు. ఇప్పుడు నా దగ్గర మీరెంత మంది వున్నారో అన్ని మగ జంతువుల పేర్లు, వాటికి సంబంధించిన ఆడ జంతువుల పేర్లు ఇంగ్లీషులో వ్రాసిన చీటీలు వున్నాయి.

చీటీలో మగ పేర్లున్న చీటీలను మగవాళ్ళకి, ఆడ పేర్లు వున్న చీటీలను ఆడవారికి పంచటం జరుగుతుంది. ఎవరికి వచ్చిన చీటీలో ఏ పేరు వున్నదో చూసుకుని వుండాలి. నేను డిప్టిసి పాయింటుగా మీ అందరికీ ఒక ప్రక్క మరో యాభై మీటర్ల దూరంలో నిలబడి వుంటాను.

నేను విజిల్ వేయగానే మగవారు అంతా వారి చీటీల్లో వున్న షీ-యానిమల్స్ పేరు అరుస్తూ ఆడవారి వేపు పరుగెత్తాలి. ఆడవారు వాళ్ళ వాళ్ళ ప్రదేశాల్లో అలాగే నిలబడి వుండి, తమ చీటీలో వున్న పేరు పిలిచిన వారికి తెలియజేసి వారిద్దరూ కలిసి డిప్టిసి పాయింట్ అంటే రిఫరీ దగ్గరకు పరుగెత్తి కెళ్ళాలి.

అలా ముందు చేరిన మూడు జంటలకీ వరుసగా మొదటి, రెండు, మూడవ బహుమతులు అందజేస్తాం

వివరాలు చెప్పి రిఫరీ చీటీలు పంచటం మొదలుపెట్టాడు. చీటీలు పంచటం అయ్యాక మగవాళ్ళనీ, ఆడవాళ్ళనీ సన్ముఖాభిముఖంగా 50 మీటర్ల దూరంలో నిలబెట్టారు. మా వరుసలో నేనొక చివరిగా ఆడవాళ్ళ వరుసలో నా శ్రీమతి ఒక చివరగా నిలబడ్డాము.

వివరాలు వింటూ వుంటే నా గుండెలు లయ తప్పాయి. ఎరక్కపోయి ఇరుక్కుపోయానా అని ఆలోచించడం మొదలుపెట్టాను. పేరెంట్స్ ఈవెంటు అంటే పేరెంట్స్ జంటల మధ్య ఏదో పోటీ అనుకున్నాను కానీ ఈ ఈవెంటు ఇలా వుంటుందని నాకు నిజంగా తెలియదు.

కాజువల్‌గా నా చీటీలోకి చూశాను. 'టైగర్'. ఎదురు వరుసలో సరిగ్గా నాకెదురుగా నిలబడ్డ నా శ్రీమతి ముఖంలోకి చూశాను. నిజం చెప్పాలంటే చూడాలని అనుకున్నానేమో కానీ చూసి వుండను. చూసే ధైర్యం నాకు లేదు.


'ఈ ఈవెంటు వ్యవహారం నీకు తెలిసే చేరావు కదా!' అన్నట్లు నా మీద ఆవిడ బహుశా కొర కొర చూపులు ప్రసరింప చేస్తోందనుకున్నా.

"సత్య ప్రమాణపూర్తిగా ఈ ఐటమ్ ఇలా వుంటుందని నాకు తెలియదోయ్" అని ఎంతో సిన్సియర్‌గా నేను చెప్పినా ఆవిడ నమ్మదు.

ఇక ఇవాల్టికి నాకు సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్ తప్పదు. అంతవరకూ వున్న హుషారు, ఉత్సాహమంతా మాయమయిపోయింది. ఎక్కడలేని నీరసం, నిరుత్సాహం నన్నావరించింది.

"మీరు పూర్తిగా నాకే చెందాలి. ప్రతి మాటా నాతోనే మాట్లాడాలి. ప్రతి అడుగు నాతోనే వెయ్యాలి. కానీ మరో రకంగా కూడా వూహించడానికి కూడా నేను ఇష్టపడను" ఇది నా శ్రీమతి మా పెళ్ళయిన తరువాత నాతో మాట్లాడిన మొదటి మాట.

ఆ క్షణాల్లో గర్వంతో పొంగిపోయాను. కానీ తరువాత తరువాత ఆవిడ ఆశయం ధ్వనించిన నిర్ణయాల్లో



ఎంత ప్రతిబంధకంగా తయారయి ఎంత అశాంతికి దారి తీయగలదో అనుభవంలోకి వస్తుంటే నానా ఇబ్బందులూ ఎదుర్కొంటూ వున్నవాళ్లే.

నా శ్రీమతి మాత్రం తన హృదయంలో నించి వచ్చే ప్రతి మాట నాతోనే మాట్లాడాలని, తన జీవితంలో ప్రతి క్షణం నాతోనే గడపాలని తప్ప మరో విధంగా ఊహించనైనా ఊహించదని నేను మన స్ఫూర్తిగా నమ్ముతాను. గుండె నిండుగా గర్విస్తాను. ఒక గృహిణిగా నా శ్రీమతి నూరు శాతం అలాగే వుండ గల్గుతుంది.

అయితే నేను మాత్రం ప్రభుత్వాధికారిని కావడం వల్ల తప్పనిసరిగా ఇతర స్త్రీలతో మాట్లాడి తీరవలసి వుంటుంది కనుక మహా ఇబ్బందిని ఎదుర్కోవలసి వస్తూ వుండేది. ఇటువంటి సందర్భాలలో నా శ్రీమతితో ఎన్నో చిన్న చిన్న గృహచ్ఛిద్రాలూ, మరి కొన్ని సత్యాగ్రహ రాత్రులు కూడా తప్పనిసరి అయ్యేవి.

అలాంటిది ఈ పరిస్థితుల్లో ఈ ఈవెంట్‌లో నేను మరో స్త్రీతో కాని కలిసి పరుగెత్తామంటే 'అమ్మ బాబోయ్'

మరో విషయం కూడా నిశ్చయంగా నాకు తెల్సు. నా శ్రీమతి తన చీటీలో వున్న పేరు పిల్చినవారికి రెస్పాన్స్ ఇవ్వదు. వాళ్ళు అలాగే నిలబడి వుండేవాళ్ళు కనుక తను రెస్పాన్స్ ఇవ్వకపోయినా ఎవరూ గమనించరు.

కానీ నా విషయం అలా కాదే. వచ్చినట్లు ని యానిమల్ నేమ్ చెపుతూ పరుగెత్తాలి కదా!

మొత్తానికి ఈ ఈవెంట్ మా ఆవిడకే భద్రత, సౌకర్యాలత. నాకేమో అడకత్తెర. అతి కష్టం మీద ఆలోచనల దాడిని ఆపగలిగేను

'ఇక ఈవెంట్ ప్రారంభిద్దాం' అంటూ ఆయన మాకు దూరంగా వెళ్ళి నిల్చున్నాడు.

నేను అలా ఆలోచిస్తూ శ్రీమతి వంక చూశాను. ఎప్పట్నుంచి చూస్తోందో తెలియదు కానీ, ఆవిడ నావంకే చూస్తూ వుంది. చేసుకున్న కొద్దో, గొప్పో అదృష్టం ఏమిటంటే, ఆ చూపుల్లో నిర్లిప్తత తప్ప కోపం అంతగా ప్రస్ఫుటమవటం లేదు. అంటే నేను నమ్మినట్లే నూటికి నూరుపాళ్లూ ఈ ఈవెంట్‌లో తను రెస్పాన్స్ ఇవ్వదు. ఇక నేను ఏం చేస్తానా అని అబ్జర్వ్ చేస్తూ వుంటుంది.

నా ఆలోచనల్లో ఎన్నో జ్ఞాపకాలు సినిమా రీళ్లలా తిరిగిపోతున్నాయి.

నా ఒళ్ళు జలదరించేలా రిఫరీ విజిల్... అది నా డెత్ వార్నింగ్‌లా వినబడింది. ఒక్కసారిగా గోలగోల. రకరకాల అడ జంతువుల పేర్లు, అరుపులు. అందరూ పరుగు ప్రారంభించిన శబ్దం.

నాకు జ్ఞాపకాలతోటే సరిపోయింది కానీ, కర్తవ్యం ఆలోచనల కందలేదు. అడుగు సాగడం లేదు. కలలో లాగా బిగుసుకుపోయాను. నోరు పెగలడం లేదు. అసలు నా చీటీలో వున్న యానిమల్ పేరు కూడా గుర్తుకు రావడం లేదు.

ఎదురుగా... సరిగ్గా నాకు అభిముఖంగా నాకేసే చూస్తూ నిర్భావంగా- నిశ్శబ్దంగా నా శ్రీమతి.

అలా బిగుసుకుపోయినట్లుండిన నా చుట్టూ విపరీతమైన అలజడి కేకలు... నా చుట్టూ చేరిన పిల్లలు నా ఇమ్మొబిలిటీ చూసి, ఆశ్చర్యంతో

స్టార్ట్... క్విక్... అంకుల్

షట్... అంకుల్

రన్.. అప్... అంకుల్

అని విపరీతంగా కేకలు పెడుతున్నారు.

'జంప్ అవుట్ డాడీ!' మా అబ్బాయి పెద్దగా అరిచాడు. ఒక్క క్షణంలో ఏదో వంతు వాడి ముఖంలోకి చూశాను. వాడి ముఖంలో అంతులేని యాంగ్జయిటీ.

ఒక్కసారిగా నా నెత్తి మీద షెడ్డులను చరిచి నట్లయింది. నో- ఏమైనా సరే... మా బాబుని చిన్నబుచ్చకూడదు, నిరుత్సాహపరచకూడదు. నాలో తెగింపు- ఆ క్షణంలో ఓ స్థిరమైన నిర్ణయం నా మనస్సులో రూపుదిద్దుకొని స్థిరపడిపోయింది. ఈ గండాన్ని ఎలా ఎదుర్కోవాలో వ్యూహం సిద్ధమైపోయింది.

ఛటాలున చుట్టూ చూశాను. అప్పటికే మిగతా వాళ్ళందరూ అతి బిగ్గరగా అరుచుకుంటూ పరుగులు తీస్తున్నారు. అప్పుడే సుమారు 10 మీటర్లు ముందుకు వెళ్ళిపోయి వున్నారు.

అంతే! ఒక్క క్షణం కూడా వృధాపర్చకుండా ముందుకి ఒక్క దూకు దూకాను. దూకుతూ మా బాబు ముఖంలోకి చూశాను. వాడి చూపుల్లో నేను నెగ్గుతానన్న అనంత విశ్వాసం. నన్ను ఛీరప్ చేస్తూ వాడు- వాడి ఫ్రెండ్స్ కొడుతున్న క్లాప్స్...

మరుక్షణం ముందు బయలుదేరినవారితో సమానమైపోయాను. తిన్నగా చూశాను. నా అభిముఖంగా వున్న నా శ్రీమతి ముఖంలో చిన్న ఆశ్చర్యం.

అదే గాలప్‌తో అందరికన్నా ముందు వురికి నా శ్రీమతిని సమీపించి చెయ్యి ఛట్ మని పట్టుకొని 'రా' అని అరచి ఆవిడ్ని లాక్కొని అదే వూపుతో రిఫరీ వైపు పరుగెత్తాను. ఈ ఈవెంటు మొదలైన తరువాత నా నోటి నుండి వచ్చిన మొదట మాట అదే.

నేనేం చెయ్యబోతున్నానో ఏ మాత్రం వూహించని నా శ్రీమతి ముందు బిత్తరపోయినా, నేనావిడ చెయ్యి పట్టుకున్న తక్షణం కుదుటపడి నాతోపాటే లేడిలా ఛెంగున దూకింది. నే నించుమించుగా నా శ్రీమతిని లాక్కెళ్ళినట్లే అతి వేగంగా సాగి, మొదటగా రిఫరీని చేరి రొప్పుతూ 'వుయార్ ఫస్ట్' అన్నాను.

'కంగ్రాచ్యులేషన్స్' అంటూ 'మీ చీటీలు ఇవ్వండి' అన్నారాయన.

అదే నేననుకున్న క్షణం. నాకు తెల్సు. మేమెలాగూ గెలవం. నాకు కావల్సిందల్లా మేము పార్టిసిపేట్ చేసినట్లుండడం, అదే రకంగా నాకు సమస్య లేకుండా గండం గట్టెక్కడం.

అందుకే ఏది ఏమైనా నేను నా శ్రీమతి చేయి మాత్రమే పట్టుకొని పరుగెత్తి రిఫరీని చేరాలి. ఇదే నా అప్పటి నిర్ణయం. అందుకే నా చేతిలోని చీటిని నిర్లిప్తంగా ఆయన కందించాను. నా శ్రీమతి కూడా అలాగే చేసింది.

నేను మామూలుగా ఆయన కేసి చూస్తూ అలా నిలబడ్డాను మా డిస్‌క్వాలిఫికేషన్ గురించి వినడానికి తయారుగా. ఆయన రెండు చీటీలు చూశారు. మా పేర్లు అడిగి రాసుకున్నారు.

ఇప్పుడు అపరిమిత ఆశ్చర్యం నా వంతయింది వెంటనే అనౌన్స్ చేశారు.

నా పేరు, నా శ్రీమతి పేరు చదివారు. అందరి చప్పట్లతో మారుమ్రోగింది ఆ ప్రదేశం అంతా.

విక్టరీ స్టాండ్ పైకి నా శ్రీమతిని చేయి పట్టుకు తీసుకువెళుతూ, రిఫరీతో అన్నాను "ఇన్సిడెంటల్లీ షి ఈజ్ మై వైఫ్' అని.

ఆయన ఎంతో ఉత్సాహంతో మరింత బిగ్గరగా మైక్ దద్దరిల్లే లాగా ప్రకటించారు.

'డియర్ జెంటిల్‌మన్- లేడీస్ అండ్ చిల్డ్రన్! అయామ్ ఎక్సయిటెడ్ టూ ఎనౌన్స్ దట్ ది ఫస్ట్ ప్రైజ్ విన్నింగ్ పెయిర్ ఆర్ ఆల్సో ద మేడ్ ఫర్ ఈచ్ అదర్ కపుల్' చివరి మాటలు ఒత్తి పలికారు.

ఇక మైదానం అంతా మాకు చెప్పిన ఛీర్స్‌తో హోరెత్తిపోయింది.

'మా బాబు వచ్చి కంగ్రాట్స్ మమ్మీ! కంగ్రాట్స్ డాడీ!' అంటూ కిస్ చేసినపుడు వివరించలేని అనుభూతి.

అవిరామంగా మోగుతున్న చప్పట్లతో నా శ్రీమతి చేయి పట్టుకుని డయాస్ మీదకు వెళ్ళి ప్రయిజ్ అందుకుంటున్నపుడు అనిర్వచనీయమైన అనుభవం.

నేను ఎంతో భయపడి, మధన పడిన క్రీడ ఇంత ఆనందానికి కారణం కావడం జీవితంలో ఒక ప్రత్యేకమైన అనుభవం అవుతుందని ఊహల్లో కూడా అనుకోలేదు. ఇక రాత్రంతా నాకు వసంత రాత్రనీ, మేమున్న ప్రదేశమే స్వర్గధామమయిందనీ వేరే చెప్పాలా?

పడుకోబోయే ముందు ఎంతో ఇదిగా నా శ్రీమతిని అడిగాను.

'నీ చీటీలో ఏముందోయ్?' అని

'షై గర్ల్' ఆవిడ సమాధానం.

ఇది మాత్రం నిప్పంకోచంగా భగవత్సహాయం.

